# మార్వెల్ మాన్‌స్టర్.. నేనే గ్యాంగ్‌స్టర్..



**ఇండియన్** క్లాసిక్ 'నాయకన్' వచ్చిన 38ఏండ్ల తర్వాత మళ్లీ మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన చిత్రం 'థగ్‌లైఫ్'. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రంలో శింబు, త్రిష, అభిరామి కీలక పాత్రధారులు. జూన్ 5న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ సినిమా నుంచి మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఓ మారా.. మార్వెల్ మాన్‌స్టర్.. నేనే గ్యాంగ్‌స్టర్' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచారు. ఆదిత్య ఆర్కే ఆలపించారు. సినిమాలో శింబు పోషిస్తున్న గ్యాంగ్‌స్టర్ పాత్రలోని బోల్డ్‌నెస్‌ని ఈ పాట ప్రెజెంట్ చేస్తున్నది. నాజర్, తనికెళ్ల భరణి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్, నిర్మాతలు: కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్, మణిరత్నం, శివ అనంత్, ఉదయ్‌నిధి స్టాలెన్, నిర్మాణం: రాజ్‌కమల్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్, విడుదల: శ్రేష్ఠ్ మూవీస్.

# పూర్తికావస్తున్న సంబరాల యేటిగట్టు



**హీరో సాయిదుర్గతేజ్** నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఎమోషనల్ యాక్షన్ డ్రామా 'సంబరాల యేటిగట్టు'(SYG). రోహిత్ కెపి దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం 120 రోజుల షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. దీంతో దాదాపు 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన కీలక సన్నివేశాల కోసం ప్రస్తుతం మూడు భారీ సెట్‌లను నిర్మిస్తున్నారు. నెక్ట్స్ షెడ్యూల్ ఈ సెట్స్‌లోనే జరుగనున్నది. అద్భుతమైన విజువల్స్, ఉత్కంఠను కలిగించే భారీ పోరాట సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టు మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటివరకూ చేయని మోస్ట్ పవర్‌ఫుల్ పాత్రను సాయిదుర్గతేజ్ చేస్తున్నారని, ఈ పాత్రకోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారని, త్వరలోనే ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్స్.

# లొకేషన్ల సెర్చింగ్



**తమిళ** అగ్రహీరో విజయ్ సేతుపతి హీరోగా టాలీవుడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఓ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నట్టు మేకర్స్ చెబుతున్నారు. తన సంతకాన్నీ, విజయ్ సేతుపతి అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌ని మిక్స్ చేసి పూరీ అద్భుతమైన స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, సాంకేతికంగా కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా ఉండబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. కాస్ట్ అండ్ క్రూ ఇప్పటికే ఖరారైంది. తొలి షెడ్యూల్‌కోసం సరైన లొకేషన్లను వెతికే పనిలో హైదరాబాద్, చెన్నయ్ నగరాలను టీమ్ జల్లెడ పడుతున్నారు. జూన్ చివరి వారంలో షూటింగ్ మొదలు కానుంది. విజయ్ సేతుపతితోపాటు ప్రధాన తారాగణం ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారు. విజయ్ సేతపతి నెవర్ బిఫోర్ అనిపించే పాత్ర పోషించనున్న ఈ చిత్రంలో టబు, విజయ్ కమార్ కీలక పాత్రధారులు. పూరీజగన్నాథ్, ఛార్మికౌర్ నిర్మాతలు.

# ఆకాశాన్ని ఎంతకని వెలకడతారు?



**రాబిన్‌హుడ్** తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటించిన ప్రతిష్టాత్మక పానిండియా జానపద చిత్రం 'హరి హర వీర మల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఎ.దయాకర్‌రావు నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఈ సినిమాలోని మూడు పాటల్ని మేకర్స్ విడుదల చేయగా, చెన్నైలో ఘనంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సినిమాలోని నాలుగో గీతాన్ని విడుదల చేశారు. కథానాయిక నిధి అగర్వాల్, సమర్పకుడు ఏ.ఎం.రత్నం, దర్శకుడు జ్యోతికృష్ణ, నటులు సత్యరాజ్, నాజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినిమా విజయం పట్ల వారంతా నమ్మకం వెలిబుచ్చారు. ఇక పాట విషయానికొస్తే.. 'తార తార నా కళ్లు.. వెన్నెల పూత నా ఒళ్లు.. ఆకాశాన్ని ఎంతకనీ వెలకడతారు.' అంటూ సాగిన ఈ గీతాన్ని శ్రీహర్ష రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ ఆలపించారు. పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ పాట ప్రేక్షకులకి కొత్త అనుభూతిని కలిగించేలా ఉంది. రాజుల కాలంనాటి వాతావరణాన్ని ఈ పాటలో అద్భుతంగా ఆవిష్కరించారు.




# ఈ కథ మా అమ్మాయికోసం రాశా

**'ఇది** మా అమ్మాయికోసం రాసుకున్న కథ. కానీ హీరో పాత్ర చాలా బాగా ఎలివేటైంది. మా అమ్మాయితో పాటు నిరంజన్ కూడా అద్భుతంగా నటించాడు. తెలుగు ఆడియన్స్ నాపై చూపించిన అభిమానాన్ని నా కుమార్తెపై కూడా చూపిస్తారని ఆశిస్తున్నా. జానాలకు ఈ సినిమా నచ్చుతుందని నా నమ్మకం.' అని అర్జున్ సర్జా అన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సీతా పయనం'. ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రంలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్‌రాజ్, కోవై సరళ కీలక పాత్రధారులు. అర్జున్, ధ్రువ సర్జా పవర్‌ఫుల్ పాత్రలు పోషించారు. త్వరలో సినిమా విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో అర్జున్ మాట్లాడారు. అగ్ర దర్శకులు సుకుమార్, ఉపేంద్ర ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా ఐశ్వర్య అర్జున్, నిరంజన్, మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్, గీత రచయిత చంద్రబోస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇది ప్రతి ఇంట్లో జరిగే కథ



**'నటుడిగా** నాకు సంతృప్తినిచ్చిన సినిమాల్లో 'షష్టిపూర్తి' ఒకటి. ఇది ప్రతి ఇంట్లో జరిగే కథ. అందుకే ప్రతి ఒక్కరికీ ఈ సినిమా కనెక్ట్ అవుతుంది.' అని డా.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. అర్చన, రూపేష్, ఆకాంక్షసింగ్ ప్రధాన పాత్రధారులు. పవన్ ప్రభ దర్శకుడు. రూపేశ్ నిర్మాత. రేపు సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. 'మనం ఏ పాత్ర పోషించినా ఆ పాత్రే గుర్తుండాలనేది నా సూత్రం. ఇది నా అయిదో జనరేషన్. ఇప్పటికీ నాకోసం 'షష్టిపూర్తి' లాంటి పాత్రలు రాస్తున్నారంటే అది నా అదృష్టం. తల్లిదండ్రుల పెళ్లిని పిల్లలు చూడలేరు. అందుకే అమ్మనాన్నలకు 'షష్టిపూర్తి' చేసి వారి కోరిక తీర్చుకుంటారు. ఇది ఓ గొప్ప సాంప్రదాయం. ఈ నేపథ్యంలో వచ్చే కథల్నీ, పాత్రల్నీ అస్సలు మిస్సవ్వకూడదనే ఈ సినిమాలో నటించాను. కళాకారుడికి ఆకలి, దాహం తీరదు. ఎన్ని గొప్పపాత్రలు చేసినా ఇంకా కావాలని కోరుకుంటాడు. నేనూ అంతే. ఇందులో అద్భుతమైన పాత్ర దొరికింది. మంచి సహనటులు, ఇళయరాజా సంగీతం, చక్కని కథ ఇంతకు మించి ఇంకేం కావాలి. 'షష్టిపూర్తి' తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చుతుంది.' అని నమ్మకం వ్యక్తం చేశారు రాజేంద్రప్రసాద్.

# మారణహోమాన్ని ఆపే మహాశక్తి



'హను-మాన్'ఫేం తేజ సజ్జా సూపర్ యోధాగా నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ అడ్వెంచర్ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్‌లో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'జరగబోయేది మారణ హోమం. శిథిలం కాబోతోంది అశోకుడి ఆశయం.. కలియుగంలో పుట్టిన ఏ శక్తీ దీన్ని ఆపలేదు..' అనే సాధువు వాయిస్‌తో టీజర్ మొదలైంది. ది బ్లాక్ స్వోర్డ్‌గా మంచు మనోజ్, సూపర్‌యోధగా తేజ సజ్జా ఎంట్రీలు ఈ టీజర్‌లో హైలైట్స్. ఓ వినాశనాన్ని ఆపేందుకు విధి నుంచి ఉద్భవించిన యోధుని కథగా ఈ సినిమా ఉండబోతున్నదని టీజర్ చెబుతున్నది. ఫాంటసీ విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. ఈ చిత్రానికి రచన: మణిబాబు కరణం, సంగీతం: గౌరహరి, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# తిరిగొచ్చిన కాలం



**దేవన్ స్వీయ** దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న సూపర్ నాచురల్ లవ్‌స్టోరీ 'కృష్ణలీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ కథానాయిక. జ్యోత్స్న.జి నిర్మాత. త్వరలో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా రెండో గీతాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఇటీవల విడుదల చేశారు. 'సూరి ఓరి సూరి' అంటూ సాగే ఈ పాటను భాస్కరభట్ల రాయగా, భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు. యువత కంఫర్ట్‌జోన్ నుంచి బయటకు రావాలనే సందేశం ఈ పాటలో వినిపిస్తున్నదని, సినిమానే కాక, యువతరాన్ని కూడా ముందుకు నడిపించేలా ఈ పాట ఉన్నదని జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు: అనిల్ కిరణ్‌కుమార్ జి., కెమెరా: సతీష్ ముత్యాల, సమర్పణ: బేబీ వైష్ణవి, నిర్మాణం: మహాసేన్ విజువల్స్.

# సూపర్ నాచురల్ మార్గన్



**మల్టీ** టాలెంటెడ్ హీరో విజయ్ ఆంటోని నటించిన మర్డర్ మిస్టరీ క్రై థ్రిల్లర్ 'మార్గన్'. విజయ్ ఆంటోని ఫిల్మ్స్ కార్పొరేషన్ నిర్మించిన ఈ చిత్రానికి లియో జాన్‌పాల్ దర్శకుడు. జూన్ 27న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. 'గొప్ప ఎడిటర్ అయిన లియో జాన్‌పాల్ ఈ కథ చెప్పిన విధానం నాకు నచ్చింది. ఇదొక సూపర్ నాచురల్ థ్రిల్లర్. ప్రేక్షకుల్ని ఉత్కంఠకు గురిచేసే అంశాలు ఇందులో మెండుగా ఉంటాయి. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని విజయ్ ఆంటోని నమ్మకం వెలిబుచ్చారు. విజయ్ ఆంటోని గొప్ప సంగీత దర్శకుడన్న విషయం తెలిసిందే. అలాగే ఆయన గొప్ప దర్శకుడు. గొప్ప ఎడిటర్ కూడా. అన్నింటికీ మించి గొప్ప నిర్మాత. అందుకే ఆయన నేతృత్వంలో తేలిగ్గా ఈ సినిమా చేయగలిగాను. ఈ సినిమాకోసం చాలా ఖర్చు పెట్టాం. ఇందులో అండర్ వాటర్ సీక్వెన్స్ హైలైట్‌గా ఉంటాయి. దానికోసం ఎంతో కష్టపడ్డాం. విజయ్ ఆంటోని తన పాత్రకు వందశాతం న్యాయం చేశారు. ఓ అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది.' అని దర్శకుడు లియో జాన్‌పాన్ చెప్పారు. ఇంకా సమర్పకుడు జె.రామాంజనేయులు, ప్రధాన పాత్రధారులు అజయ్ ధీషన్, దీప్శిఖ, బ్రిగిడా కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: యువ ఎస్..



# ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో

**పాకిస్తాన్** ఉగ్రదాడికి ప్రతిగా మన సైనికులు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ని ప్రేరణగా తీసుకొని ప్రముఖ ఆరోగ్య డైట్ లక్ష్మణ్ పూడి ఓ పాటను స్వీయ దర్శకత్వంలో నటిస్తూ, రూపొందించారు. ప్రసాద్ రాసిన ఈ పాటకు రమేష్ సంగీతాన్ని అందించగా, కృష్ణ సినిమాటోగ్రఫీ అందించారు. ఉమా శంకర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటను విడుదల చేసేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, జెఏసీ చైర్మన్ అంజిబాబు, నటుడు అలీ, మేజర్ ఒబెరాయ్ అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ప్రేక్షకుల మనసుల్లో దేశభక్తిని రగిలించే పాట ఇదని, దేశం కోసం ఏదోఒకటి చేయాలనే స్ఫూర్తిని అందరిలో కలిగించేందుకే ఈ పాట రూపొందించామని, దేశం కోసం కుటుంబాలను సైతం వదులుకొని, సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులకు ఈ పాట అంకితమని లక్ష్మణ్ పూడి తెలిపారు.





